SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 149 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 18-08-2026

## 22-A పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడితే సహించబోం



❖సామాన్యులను 22-A పేరుతో ఇబ్బంది పెడితే సహించేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

❖ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, ఆయా సమస్యల్లో జాప్యం చేస్తే ఇకపై సహించబోమని వార్నింగ్ ఇచ్చారు.

సామాన్యులను 22-A పేరుతో ఇబ్బంది పెడితే సహించేది లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, మిగతా 2లో

## విద్యా ప్రమాణాలు పెంచితేనే
# అభివృద్ధి సాధ్యం
### డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

- నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే
- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెన్జీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపీకి సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం
- మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు.
- వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు.
- డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు.
- "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం.



మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసన సభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. మిగతా 2లో

## 'ఎంతమందిని వెన్నుపోటు పొడుస్తావ్ చంద్రబాబూ?'



- డీఎస్సీ అక్రమాలపై వెన్నుపోటు పార్టీ నేతలు సమాధానం చెప్పకుండా పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- సోమవారం ఏపీ మండలి సమావేశాల నేపథ్యంలో బొత్స మీడియాతో మాట్లాడారు. 'డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరగాలి.

డీఎస్సీ అక్రమాలపై వెన్నుపోటు పార్టీ నేతలు సమాధానం చెప్పకుండా పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మిగతా 2లో

## విద్యార్థుల సమయాన్ని వృథా చేస్తున్నారు.

- మూడు సబ్జెక్టుల యూజీసీ-నెట్ పరీక్షలు రద్దు
- ఎన్‌టీఏపై రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం
- "తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?" అని ప్రశ్న
- విద్యార్థుల సమయం, డబ్బు వృథా చేస్తున్నారని విమర్శ



యూజీసీ-నెట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. "ఎన్‌టీఏ తప్పు చేస్తోంది.. మిగతా 2లో

## హర్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తా!: ట్రంప్

- ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హర్ముజ్ జలసంధిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
- ఇప్పటిదాకా కేవలం దాని నియంత్రణ మాత్రమే తమదేనంటూ ఆయన ప్రకటించుకుంటూ వస్తున్నారు.



ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హర్ముజ్ జలసంధిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటిదాకా కేవలం దాని నియంత్రణ మాత్రమే తమదేనంటూ ఆయన ప్రకటించుకుంటూ వస్తున్నారు. మిగతా 2లో

### 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..
## ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం



- డీఎస్సీ పరీక్షను ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించామన్న లోకేశ్
- విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చామని వెల్లడి
- వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మద్యం దుకాణాల వద్ద నిలబెట్టిందని మండిపాటు
- డిగ్రీ పూర్తి కాగానే క్రికెటర్ శ్రీ చరణికి ప్రభుత్వ ఉద్యోగం: అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలపై కీలక వివరాలు వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించిందని, మిగతా 2లో

## కేసీఆర్‌ది కుటుంబ పాలన...
# నాది సామాజిక పాలన
### కుటుంబ పాలనకు.. ప్రజా పాలనకు తేడా ఇదే

- ★ములుగు, పరకాల సభల్లో నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ★మా ప్రభుత్వంలో ఆడబిడ్డలు, ఉద్యమకారులకు అవకాశాలు
- ★రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమమే మా ఎజెండా
- ★సామాజిక న్యాయం మా నైజం..
- ★సెప్టెంబర్‌లో అసెంబ్లీ పెడతా.. అన్ని లెక్కలు అక్కడ మాట్లాడతాం
- ★2029లో రెట్టింపు మెజారిటీతో గెలిపించండి
- ★పరకాల, ములుగు సభల్లో ప్రసంగించిన ముఖ్యమంత్రి



'కేసీఆర్ ముఖ్యమంత్రి అయితే ఆయన కుటుంబానికే లాభం.. నేను ముఖ్యమంత్రి అయితే ప్రజలకే లాభం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులకే పదవులు దక్కాయని.. తమ ప్రజా ప్రభుత్వంలో ఆడబిడ్డలు, ఉద్యమకారులు, సామాజిక వర్గాలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి వరంగల్ పరిధిలోని ములుగు, పరకాలలో ఆదివారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, 'ప్రజా పాలన-- ప్రగతి బాట' బహిరంగ సభల్లో సీఎం ప్రసంగించారు. 'రక్తం పంచుకుని పుట్టకపోయినా సీతక్కను ఆడబిడ్డగా గౌరవిస్తున్నా. ఇంకోవైపు రక్తం పంచుకుపుట్టిన సోదరిని ఆస్తికోసం ఇంటి నుంచి పంపించారు. సలాక కాల్చి కొడుక్కి బుద్ధి చెప్పాల్సిన తండ్రి ఫామ్‌హౌస్‌లో పడుకున్నాడు. మిగతా 2లో

## లక్షలాది కుటుంబాలకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్



⌘తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలు, మహిళలు, రైతులు, వృద్ధుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలు, మహిళలు, రైతులు, వృద్ధుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి పథకం రద్దు చేయడానికి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మిగతా 2లో

## బాబూ.. ప్రశ్నిస్తే టీచర్లపై
# సస్పెన్షన్ విధిస్తారా?
### అది నేరమా?.. టీచర్ల సస్పెన్షన్‌పై వైఎస్ జగన్ ఫైర్!

- టెట్ నుంచి మినహాయింపు కోరిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారన్న జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం
- ఇది కక్ష సాధింపు చర్యేనని సోషల్ మీడియాలో విమర్శలు
- సస్పెన్షన్లు ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్
- టీచర్లకు న్యాయపరంగా అండగా ఉంటామని హామీ



చంద్రబాబూ.. ప్రభుత్వ ఉద్యోగులపై, అందులోనూ టీచర్లపై కక్ష సాధింపు చర్యలేంటని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. టెట్ నిబంధన వల్ల మిగతా 2లో

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్టు శాశ్వత మైలురాయి



గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా

బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం

రాజమహేంద్రవరం సమీపంలో పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీ నూకరాజు కుటుంబ సభ్యులతో కలిసి మిగతా 2లో

## పేరు మార్చినంత సులువుగా
# హాస్పిటల్ కట్టిన చరిత్రను మార్చలేవు
### 22-Aతో రేవంత్ ప్రభుత్వం గందరగోళానికి తెరలేపింది'

- తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు మరోసారి ధ్వజమెత్తారు.
- రాష్ట్రంలో 30 శాతం ప్రభుత్వం నడుస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు.



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు మరోసారి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 30 శాతం ప్రభుత్వం నడుస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లో మిగతా 2లో

సీమకిరణం నంద్యాల కర్నూలు
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# విద్యార్థుల సమయాన్ని వృథా చేస్తున్నారు.

దానికి విద్యార్థులు శిక్ష అనుభవిస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన విద్యార్థులు.. మళ్లీ దాని కోసం సమయం, డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థుల విలువైన సమయాన్ని ఎన్‌టీఏ వృథా చేస్తోందని విమర్శించారు. జూన్ 22 నుంచి 30 మధ్య సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయని రాహుల్ గుర్తుచేశారు. దాదాపు రెండు నెలల తర్వాత ఈ మూడు పరీక్షలను రద్దు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రశ్నపత్రాల్లో తప్పులు చేయడమే కాకుండా.. గతంలో అడిగిన ప్రశ్నలను మళ్లీ ఇచ్చారని ఆరోపించారు. పరీక్ష కోసం దరఖాస్తు చేసి, ఫీజులు కట్టి, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లిన వేలాది మంది అభ్యర్థులు ఇప్పుడు సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తోందని పేర్కొన్నారు."ఇది విద్యార్థులకు పరీక్ష మాత్రమే కాదు. వారి డబ్బు, సమయం, మానసిక ప్రశాంతతను కూడా దెబ్బ తీస్తోంది. చివరకు ఉద్యోగం కూడా దక్కడం లేదు" అంటూ రాహుల్ విమర్శించారు. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లో తాను విద్యార్థులతో మాట్లాడినప్పుడు కూడా ఇదే విషయాన్ని చెప్పానని తెలిపారు. దేశంలో విద్యా వ్యవస్థ కంటే విద్యార్థుల నుంచి డబ్బు, సమయం పిండుకునే వ్యవస్థగా పరిస్థితి మారిందని ఆరోపించారు. అసలు ప్రశ్నకు ఎన్‌టీఏ సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. పరీక్షకు ముందే ప్రశ్నపత్రాలు లీకయ్యాయా? అని ప్రశ్నించారు. పరీక్షల్లో వరుసగా తప్పులు జరుగుతున్నా బాధ్యులపై చర్యలు ఎందుకు ఉండటం లేదని నిలదీశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనని, ఎన్‌టీఏ ఉన్నతాధికారులూ బాధ్యత వహించాలని అన్నారు. సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాహుల్ చెప్పారు. తప్పు విద్యార్థులది కాదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

## హర్ముజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తా!: ట్రంప్

ఈ క్రమంలోనే సైన్యం మోహరించామని చెబుతున్నారు. అయితే తాజాగా ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని మరో సంచలనానికి తెర తీశారు."ఇరాన్‌ను ఓడించడం ఖాయం. ఆ తర్వాత.. అతి త్వరలో హర్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఈ నిర్ణయం ఎలా అమలు చేస్తారు? దీనికి అంతర్జాతీయంగా ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై ఆయన ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ట్రంప్ చెబుతుండగా.. ఇరాన్‌పై మరింత కఠిన ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా వర్గాలు చెబుతున్నాయి. ఇరాన్‌పై చర్యల కారణంగా ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని ట్రంప్ అంగీకరించారు. "అమెరికన్లు పెట్రోల్ కోసం కొంచెం ఎక్కువ చెల్లించాల్సి రావచ్చు. కానీ ఇరాన్ అణ్వాయుధ శక్తిగా మారకుండా అడ్డుకోవడం ప్రపంచానికి చేసే సేవ" అని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ ఘాటుగా స్పందించింది. హర్ముజ్ జలసంధిపై నియంత్రణ తమదేనని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాది స్పష్టం చేశారు. "ఒక ట్వీట్‌తోనో, విమాన వాహక నౌకతోనో హార్ముజ్‌ను స్వాధీనం చేసుకోలేరు. ఇరాన్ ఓటమిని అంగీకరించే వరకు ఈ మార్గంపై మా నియంత్రణ కొనసాగుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఇంధన మార్కెట్లకు హర్ముజ్ జలసంధి అత్యంత కీలకం. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, ఎల్ఎన్‌జీలో దాదాపు 20 శాతం ఈ మార్గం గుండా రవాణా అవుతుంది. అయితే ఫిబ్రవరి 28వ తేదీన మొదలైన అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఫలితంగా ముడి చమురు ధరలు పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరువైంది. అమెరికాలో పెట్రోల్ ధర గ్యాలన్‌కు 4 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా--ఇరాన్ మధ్య శాంతి చర్చలు నిలిచిపోయాయి. యుద్ధాన్ని ముగించే దిశగా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మరోవైపు ఇరాన్‌పై మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధిస్తామని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ తెలిపారు. హర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం సాగుతున్న ఈ పోరు కొనసాగితే.. ప్రపంచ చమురు సరఫరా, ఇంధన ధరలపై మరింత ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి.. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకంగా 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని సభకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి ఏటా క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని లోకేశ్ వివరించారు. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి కించపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవస్థను ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై న్యాయస్థానాల్లో 336 కేసులు దాఖలైన విషయాన్ని మంత్రి గుర్తుచేస్తూ, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని వెల్లడించారు. ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కి సంబంధించి 3.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారనే గణాంకాలను అసెంబ్లీ వేదికగా లోకేశ్ సమర్పించారు.

## లక్షలాది కుటుంబాలకు అండగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

అనంతరం ప్రజల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మహిళలతో కలిసి వీ=హాకి అందజేశారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహ భారం తగ్గించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచాయని తెలిపారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు గత పదేళ్లుగా విజయవంతంగా అమలవుతున్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం వారి అనుకూలమైన వ్యక్తితో కోర్టులో కేసు వేయించి ఈ పథకాన్ని రద్దు చేయాలన్న కుట్రలు చేస్తుంది. కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా ఈ పథకాలను కొనసాగిస్తామని ప్రభుత్వం కోర్టులో స్పష్టమైన అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయడం లేదు..? అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. వచ్చే విచారణలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తామని ప్రకటించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి పథకం తొలుత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రూ.50,000 సహాయంతో ప్రారంభమై, అనంతరం బీసీలతో పాటు అన్ని వర్గాల పేదలకు విస్తరించిందని వేముల గుర్తుచేశారు. ఆర్థిక సహాయాన్ని దశలవారీగా పెంచుతూ చివరకు రూ.1,00,116కు చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల వివాహాలకు దాదాపు రూ.13 వేల కోట్ల ఆర్థిక సహాయం అందించిన కేసీఆర్ ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు మేనమామలా అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి ఆర్థిక సాయంతోపాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న ప్రతి అర్హురాలికి ఎన్నికల హామీ మేరకు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టారు అని వేముల అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కోర్టులో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించి, పథకాల కొనసాగింపుపై అఫిడవిట్ దాఖలు చేయాలి. ఎన్నికల హామీ మేరకు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం అందించాలన్నారు.

## 22-A పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడితే సహించబోం

ఆయా సమస్యల్లో జాప్యం చేస్తే ఇకపై సహించబోమని వార్నింగ్ ఇచ్చారు. **22-A** భూములపై సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈరోజు (సోమవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల అధికారులతో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. సబ్‌రిజిస్ట్రార్‌ల వారీగా ఆయా దరఖాస్తుల గురించి అధికారులతో మంత్రి మాట్లాడారు. ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి..?, ఎప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్నాయి? అని అధికారులను ప్రశ్నించారు. పెండింగ్ దరఖాస్తులను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. **22-A**లో భూమి ఉందనే కారణంతో ఆ దరఖాస్తును తిరస్కరించొద్దని హుకుం జారీ చేశారు. భూమి నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చిందో ఆయా రికార్డులు, వాస్తవ పరిస్థితులపై సమగ్రంగా పరిశీలించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. నిజమైన భూ హక్కుదారులకు న్యాయం చేస్తూనే ప్రభుత్వ భూములు, ఆస్తులను కాపాడాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల రక్షణ, ప్రజల హక్కుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.

## 'ఎంతమందిని వెన్నుపోటు పొడుస్తావ్ చంద్రబాబూ?'

శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏపీ మండలి సమావేశాల నేపథ్యంలో బొత్స మీడియాతో మాట్లాడారు.'డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరగాలి. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలన్నదే మా డిమాండ్. అందుకు కూటమి నేతలు సమాధానం చెప్పడం లేదు. కౌన్సిల్‌లో మేము చర్చకు రావాలని కోరాం. కానీ తప్పు చేసిన ప్రభుత్వం చర్చకు రాకుండా తోక ముడిచింది. చర్చకు రాకుండా సవాల్ చేయటం ఎందుకు?. డీఎస్సీ కమిషనర్‌గా ఇతర అధికారిని ఎందుకు నియమించ లేదు? అధికారులు లేక రాష్ట్రం ఏమైనా గొడ్డుపోయిందా?. కృష్ణా జిల్లా టాపర్ నవీన్‌కు ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదు?. అతను ఎందుకు కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది?. స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయన్నది వాస్తవం. ఉద్యోగాలను అమ్ముకున్నట్టు వచ్చిన ఆడియో, వీడియో టేపులపై విచారణ ఏదీ?. వాళ్లను పట్టుకుని పూర్తి స్థాయిలో విచారణ చేస్తే వాస్తవాలు బయటకు వచ్చేవి కదా?. అందుకే మేము సీబిఐతో విచారణ చేయమని అడిగాం. గ్రూప్1 మీద కూడా సీబీఐతో విచారణ చేయించుకోండి. మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఎంతమందిని వెన్నుపోటు పొడుస్తారు చంద్రబాబూ?. లక్షా 30 వేల ఉద్యోగాలను ఎలాంటి అక్రమాలు లేకుండా ఒకేసారి మా హయాంలో ఇచ్చాం. చంద్రబాబు 16 వేల పోస్టులకు అక్రమాలు చేశారు. ఈ మొత్తం వ్యవహారాలపై సీబిఐతో విచారణ చేయాల్సిందే. మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందే. ప్రభుత్వం బెదిరించడం వల్లే డీఎస్సీ టీచర్లు కర్నూలు, విజయవాడలో ర్యాలీ చేశారు. ర్యాలీలకు రాకపోతే ఉద్యోగం తొలగిస్తామని బెదిరించారు. డీఎస్సీ అక్రమాలను రాజకీయ కోణంలో చూడవద్దు. అర్హులందరికీ న్యాయం జరగాలి. అక్రమాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నదే మా డిమాండ్'అని స్పష్టం చేశారు.

# కేసీఆర్‌ది కుటుంబ పాలన... నాది సామాజిక పాలన

వీళ్లు తెలంగాణ ఆడబిడ్డలకు మేలు చేస్తారా? సొంత చెల్లికి న్యాయం చేయని కేటీఆర్ రెండు కోట్ల మంది అక్కాచెల్లెళ్లకు మేలు చేస్తారా?' అని రేవంత్ ధ్వజమెత్తారు.

కేసీఆర్‌కు... నాకు తేడా అదే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు కేటీఆర్, హరీశ్‌రావులను మంత్రులను చేశారని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. తాను సీఎం అయిన తర్వాత సీతక్క, కొండా సురేఖలకు మంత్రి పదవులు ఇచ్చానన్నారు. కేసీఆర్.. ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంత్రి పదవి ఇస్తే.. తాను అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం కల్పించ నన్నారు. కేసీఆర్ తన కుమార్తెను ఎంపీగా, ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్సీగా చేశారని.. తాను కావ్యను ఎంపీగా, యశస్వినిని ఎమ్మెల్యేగా చేశానని చెప్పారు. కేసీఆర్ సడ్డకుని కొడుకు సంతోష్‌రావును ఎంపీని చేస్తే.. తాను మిత్రధర్మంతో వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ అవకాశం ఇచ్చానన్నారు. ఓడిపోయిన బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు ప్లానింగ్ కమిషన్ వైస్‌చైర్మన్ పదవి ఇస్తే.. తాను ఉద్యమకారుడు కోదండరాంను ఎమ్మెల్సీగా చేశానన్నారు. కేటీఆర్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేస్తే.. తాను మహేశ్‌కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా చేశానని చెప్పారు.

వచ్చే నెల్లో అసెంబ్లీ పెడతా...

'అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని బావా, బావమరదులు అడుగుతున్నారు. సెప్టెంబర్‌లో సమావేశాలు పెడతా. కేసీఆర్‌ను కూడా తీసుకొని రండి అక్కడే అన్నీ మాట్లాడుదాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ముఖ్యమంత్రి అయితే ఎవరికి లాభం జరిగిందో లెక్కలతో చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 2029 ఎన్నికలకు ఇప్పటినుంచే రాజకీయ సమరానికి సిద్ధమవుతున్నట్లు రేవంత్ సంకేతాలిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వానికి రెట్టింపు మెజారిటీ ఇవ్వాలని కోరారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎంతమంది కేసీఆర్‌లు వచ్చినా తనను ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు.

ఇందిరమ్మ రాజ్యం

సమ్మక్క--సారలమ్మ ఆశీస్సులతోనే తాను ములుగునుంచి పాదయాత్ర ప్రారంభించానని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. రాష్ట్ర నలుమూలలా ప్రతీ గూడెం, పల్లెకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని భరోసా ఇచ్చామని, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని తెలిపారు. ఆదివాసీ బిడ్డలు కష్టానికి మారుపేరని, వారి కష్టాలు తీరాలంటే ములుగు ప్రాంతానికి సాగునీరు అందాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యమని సీఎం చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఖాళీలను గుర్తించి భర్తీ చేస్తామని ప్రకటించారు. 'ఉద్యోగాలు భర్తీ చేసే బాధ్యత మాది.. పరీక్షలకు సిద్ధం కావాల్సిన బాధ్యత మీది' అని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. జంపన్నవాగును నూటికి నూరు శాతం అభివద్ధి చేస్తామని ప్రకటించారు. గత పాలకులు బతుకమ్మ చీరల్లో కమీషన్ నొక్కి ఫాంహౌస్‌లో పడుకుంటే.. సారె పేరు మీద ఆడపడుచులకు పాలపిట్ట చీరలు అందించామన్నారు. ఈ డిసెంబర్‌లో ప్రతీ ఆడబిడ్డకు చిలకపచ్చ చీరలు అందిస్తామన్నారు. పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా వరంగల్ జిల్లా ఎప్పుడూ చైతన్యం ప్రదర్శించిందని సీఎం అన్నారు.

మీరు అండగా ఉంటే ఏమైనా చేస్తా..

ప్రజలు ఇబ్బందులు పడాలని కొందరు కోరుకున్నారని, అఘోరా పూజలు చేశారని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్.. దేవుడు తమవైపే ఉన్నాడని, వర్షాలు కురిపించాడని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. 'మన రాష్ట్రాన్ని మనమే బాగు చేసుకుందాం.. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకుందాం' అని అన్నారు. ములుగు, పరకాలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, డా.కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేదల సంక్షేమంతోపాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పరకాల నియోజకవర్గంలో రూ.400 కోట్లకు పైగా అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

# విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం

విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై దబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటీనీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు"అని ముఖ్యమంత్రి అన్నారు."మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర ఏళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ నియామకాల అంశంపై ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని విశ్వసించామన్నారు. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవవనరుల్ని తయారుచేశామని అన్నారు. విద్యారంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించిందని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారని గుర్తుచేశారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేసింది ఎన్టీఆరే అని అన్నారు. తాను సీఎం అయిన తొలినాళ్లలోనూ పాఠశాలలు లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు.

# బాబూ.. ప్రశ్నిస్తే టీచర్లపై సస్పెన్షన్ విధిస్తారా?

లక్ష మందికిపైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఒక సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అదే సమస్యను రాజకీయ కోణంలో చూసి టీచర్లకు రాజకీయాలను అంటగట్టడం దారుణం. మరీ ఇంతగా దిగజారి వ్యవహరిస్తారా? అంటూ మండిపడ్డారు .వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..'మరీ ఇంత కక్షగడతారా చంద్రబాబు?. మొదటి రోజు వైయస్సార్ కడప, రెండో రోజు అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయ సంఘాల టీచర్లను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు ఏం నేరం చేశారు? వారు ఉద్యోగంలో చేరే నాటికి లేని టెట్ ఇప్పుడు ఇన్ని సంవత్సరాల తర్వాత రాయాలి అన్న టెట్ నిబంధన వల్ల లక్ష మందికిపైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆ నిబంధన నుంచి తమను మినహాయించాలని కోరుతూ, వారికి మద్దతు ఇస్తున్న ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వడమే నేరమా? మీ రెడ్‌బుక్ అరాచక జంగిల్‌రాజ్ చివరకు ప్రభుత్వ టీచర్లనూ వదిలిపెట్టడం లేదు. చంద్రబాబు.. అసలు ఈ టెట్ నిబంధనను తొలగించాలని కేంద్రాన్ని కోరాల్సింది మీరు కాదా? ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న మీరు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి ఎందుకు తీసుకురాలేదు?. మీరు చేయాల్సిన పని చేయలేదు. సీనియర్ టీచర్ల సమస్యను గాలికి వదిలేశారు. తమ సమస్యను మా పార్టీ ఎంపీల సహకారంతో తామే కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే మాత్రం వారిపై రాజకీయ ముద్ర వేస్తారా? సస్పెన్షన్లు విధిస్తారా?. మీరు చేయలేని పని వారు చేయడానికి ప్రయత్నించడమే తప్పా?. వినతిపత్రం ఇవ్వడమే నేరమా? దానికి సస్పెన్షన్ విధిస్తారా?. ఒక సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అదే సమస్యను రాజకీయ కోణంలో చూసి టీచర్లకు రాజకీయాలను అంటగట్టడం దారుణం. మరీ ఇంతగా దిగజారి వ్యవహరిస్తారా? మొదటి రోజు వైయస్సార్ కడప, రెండో రోజు అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయ సంఘాల టీచర్లను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు ఏం నేరం చేశారు? వారు ఉద్యోగంలో చేరే నాటికి లేని టెట్ ఇప్పుడు ఇన్ని...ఉద్యోగుల విషయంలో మీ మోసం కూడా ఇదే స్థాయిలో ఉంది. అధికారం ఉందనే అహంకారంతో, నియంతృత్వ విధానాలతో మీరు చెలరేగిపోతున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు చంద్రబాబు. చివరకు మీ నీడను కూడా మీరు భరించలేని స్థాయికి వెళ్లిపోయారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు కోరుతూ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులను కలిసిన ఐదుగురు టీచర్లను సస్పెండ్ చేశారంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ నేడు సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు."మొదటి రోజు వైఎస్సార్ కడప జిల్లా టీచర్ల సంఘం వారిని, రెండో రోజు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టీచర్లను సస్పెండ్ చేశారు. ఆ ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు సస్పెండ్ చేశారు? వారు చేసిన నేరం ఏమిటి?" అని జగన్ సూటిగా ప్రశ్నించారు. సర్వీసులో చేరినప్పుడు లేని టెట్ నిబంధనను ఇప్పుడు అమలు చేయడంతో లక్ష మందికి పైగా సీనియర్ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్రను మార్చలేవు

భాగంగా రేవంత్ ప్రభుత్వంపై హరీష్ మండిపడ్డారు. 'లక్షలాది ప్రాపర్టీలు **22-A**లో పెట్టారు. రిజిస్ట్రేషన్ ఛార్జీలు తీసుకొన్న తర్వాత మీ ల్యాండ్ రిజిస్ట్రేషన్ కాదు.. ప్రొహిబిటేషన్ లో ఉంది అని చెబుతున్నారు. రేవంత్ ప్రభుత్వం గందరగోళానికి తెరలేపింది. ఎవరి భూమి ప్రొహిబిటేషన్ లో ఉందో తెలియని పరిస్థితి. సీఎం రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది. అందుకే తొలగించడానికి హడావుడి చేస్తున్నారు. రాష్ట్రం లో 30 పర్సంటేజ్ ప్రభుత్వం నడుస్తుంది. ప్రొహిబిటేషన్‌లో నుండి సర్వే నంబర్ తీసివేయాలంటే 30 పర్సంటేజ్ ఆడుతున్నారు. రెవెన్యూలో మీ పని జరగాలంటే. 30 పర్సంటేజ్ ఇవ్వాల్సిందే అంటున్నారు' అని హరీష్ విమర్శించారు. ఆలోచన, ఆచరణ కేసీఆర్‌దిఅయితే.. ప్రచారం కాంగ్రెస్‌ది అన్నట్లు ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు రేవంత్ రెడ్డి నియామక పత్రాలు ఇచ్చినట్టే.. కేసీఆర్ ప్రారంభించిన టిమ్స్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవాల పేరుతో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. నేడు సనత్‌నగర్‌లోని టిమ్స్ హాస్పిటల్ ప్రారంభోత్సవంపై ఆయన స్పందించారు. డేట్లు, డెడ్‌లైన్లు మార్చుకుంటూ పోయి, చివరకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న దవాఖానలో కూడా పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురాకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి కోట్ల రూపాయలతో నిర్మించిన హాస్పిటల్‌ను కేవలం ఓపీ సేవలకే పరిమితం చేయడం సిగ్గుచేటన్నారుసీఎం రేవంత్ రెడ్డి పేరు మార్చినంత సులువుగా హాస్పిటల్ కట్టిన చరిత్ర మార్చలేవన్నారు. హైదరాబాద్‌కు మూడు వైపులా మూడు టిమ్స్ హాస్పిటల్స్ (అల్వాల్, సనత్‌నగర్, ఎల్బీనగర్) ఏర్పాటు చేసి, పేదలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలన్నది కేసీఆర్ ఆలోచన. కరోనా తర్వాత భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని, వందేళ్ల ముందు చూపుతో కేసీఆర్ ౹×మీలకు రూపకల్పన చేశారన్నారు. 2022 ఏప్రిల్ 26న ఒకేరోజు మూడు ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ దవాకానలకు శంకుస్థాపన చేసి చరిత్ర సృష్టించారు. ప్రణాళిక కేసీఆర్‌ది.. శంకుస్థాపన కేసీఆర్‌ది.. నిధులు విడుదల చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

ఒక్కో ఆసుపత్రి వెయ్యి పడకల సామర్థ్యంతో తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (౹×మీ) పేరుతో నిర్మించే మూడింటి నిర్మాణానికి రూ.2,679 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో శరవేగంగా సాగిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నత్తనడకన సాగాయి. సకాలంలో పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మూడున్నరేళ్ల సుదీర్ఘ కాలంలో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించకుండా, కేవలం ప్రచారం కోసం నేడు ౹×మీ సనత్‌నగర్‌ను ప్రారంభిస్తున్నారు. కనీసం హాస్పిటల్‌కు నీటి సరఫరా కూడా కల్పించలేదు అంటే పేదల వైద్యం పట్ల వీరికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం అవుతుంది.

ఉచితంగా వైద్య సేవలు అందించాలి

కేసీఆర్ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేదల నుంచి ఫీజులు వసూలు చేయాలని నిర్ణయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కండ్లు తెరవండి. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో మొదలు పెట్టిన టిమ్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పేదల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్టు శాశ్వత మైలురాయి

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు విచారం వ్యక్తం చేశారు. గల్లంతైన వారిని గుర్తించి రక్షించేందుకు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అవసరమైతే ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. ఏఈ కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఇందులో ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన నుంచి బయటపడిన శ్రీ నూకరాజు మనుమడి పరిస్థితిని కూడా ఉప ముఖ్యమంత్రివర్యులు అడిగి తెలుసుకున్నారు. బాలుడికి అవసరమైన వైద్య సాయం అందించి పూర్తి స్థాయిలో కోలుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు ఒక పరిష్కార మార్గం ఉంటుందని, క్షణికావేశం, మానసిక ఒత్తిడికి లోనై ఎవరూ ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బెదిరింపులు, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు తక్షణం పోలీసులను, సంబంధిత అధికారులను సంప్రదించి చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. ప్రాణం అమూల్యమైనదని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారుఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమ్యానికి కొత్త రెక్కలు తొడుగుతూ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి సేవలు ప్రారంభం కావడం ఎంతో ఆనందదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం విజయవంతంగా ల్యాండ్ కావడంతో రాష్ట్ర ప్రగతి చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమైందని తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యాల విస్తరణ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు నిలువెత్తు రూపమని చెప్పుకొచ్చారు. ఈ విమానాశ్రయం మూలంగా కొత్త పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలు మెరుగుపడి, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత విస్తరించాలని పవన్ కోరుకున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది శాశ్వత మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా ఎదిగి, ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సేవలు అందిస్తూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

# ప్రభుత్వం తక్షణమే అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలి



**వెల్దుర్తి, ఆగస్టు 17, (సీమకిరణం న్యూస్) :** గుంటూరులోని, స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, గౌరవనీయులు వేణుగోపాల్ రెడ్డి , ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటియుసి అనుబంధం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలు శారమ్మ లు ఉదయం 12 గంటలకు కలిసి రేపటినుండి జరిగే అసెంబ్లీ సమావేశాలలో, రాష్ట్రవ్యాప్తంగా గత 50 సంవత్సరాల నుండి పనిచేస్తున్నప్పటికీ, నేటి వరకు కనీస వేతనాలు లేకుండా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, వివిధ రకాల యాప్లతో, రోజురోజుకు పని భారం పెరుగుతున్న వస్తున్నాయి, నిత్యావసర సరుకులు ధరలకు, కేంద్రంలో వేతనాలు పెరగక, 12 సంవత్సరాల అయినప్పటికీ, రాష్ట్రంలో గౌరవ వేతనం పెరగలేదు. కేంద్ర రాష్ట్ర మంత్రులకు సంబంధించిన అధికారులకు అనేక పర్యాయములు వినతి పత్రాలు ఇచ్చి చర్చించినప్పటికీ నేటి వరకు వేతనాలు పెరగలేదు. కావున రేపటి నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలలో, కంపల్సరీ కనీస వేతనాలు అమలు చేయాలని, వెంటనే శాఖ మంత్రితో, సంఘాల నేతలతో సమావేశం ఏర్పాటు చేసి, వేతనాల పెంపు మిగతా సమస్యల పరిష్కారం చేయాలని కమిషనర్ ని కోరారు. అంగన్వాడి చిన్నారులకు మెను రేట్లు పెంచాలని, మెను లో మార్పులు చేర్పులు చేయాలని, మహిళలకు వరలక్ష్మీ వ్రతానికి సెలవు ఇవ్వాలని, బకాయి బిల్లులన్నీ చెల్లించాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ మొదలగు సౌకర్యాలు కల్పించాలని, విధులలో చనిపోయిన వారికి, విధులలో ఉండి మానుకొని వెళ్లే వారికి, గ్రాజుడుటి వర్తింపచేయాలని, కమిషనర్ ని కోరడం జరిగింది. , వేతనాల పెంపు విషయం శాఖ మినిస్టర్ గుమ్మిడి సంధ్యారాణి కి లేఖ పెడతానని, గ్రాజుడుటికి సంబంధించి, సెంట్రల్ గవర్నమెంట్ కి లెటర్ పెట్టామని చెప్పారు. రాష్ట్రంలో పాపులేషన్ ఎక్కువ ఉన్నచోట, అడిషనల్ సెంటర్ల కోసం కూడా సెంట్రల్ గవర్నమెంట్కి లేఖ పెట్టామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా, 18-08-2026 తేదీ నాటికి సమస్యలన్నీ పరిష్కరించాలని, అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు జరిగే ధర్నాలలో, అంగన్వాడి టీచర్లందరూ పాల్గొంటున్నారని, కమిషనర్ గారికి తెలియజేయడం జరిగింది. నాణ్యమైన యూనిఫామ్స్ ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ఒకే రకమైన యూనిఫామ్స్ ఇవ్వాలని తెలియజేయడం జరిగింది. వచ్చే సంవత్సరం నుండి అలాగే చేస్తామని చెప్పారు. మిగతా సమస్యలు కూడా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బకాయి బిల్లుల కోసం ప్రస్తుతం బడ్జెట్ రిలీజ్ చేస్తున్నామని తెలియజేశారు. వారికి ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అనుబంధం నుండి అభినందనలు తెలియజేశాము.

# బైక్ పార్కింగ్ ఏర్పాటు ఎస్సై నాగార్జున






**ప్యాపిలి, ఆగస్టు 17 (సీమ కిరణం న్యూస్):** ప్యాపిలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు, వాహనదారుల సౌకర్యార్థం ప్రత్యేకంగా బైక్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. బస్టాండ్‌లోకి వచ్చే ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలగడంతో పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలో బైక్‌లను క్రమబద్ధంగా నిలిపేందుకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి పార్కింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రాంతంలోనే నిలిపి పోలీసులకు, ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై నాగార్జున తెలిపారు. ప్రధాన ద్వారం, బస్సులు నిలిచే ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేయరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై నాగార్జున కోరారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

## -వృద్ధులు,దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించండి

## -నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు,ఆగస్టు 17,(సిమ కిరణం న్యూస్)::** నెల్లూరు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి,ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ఐటిడిఏ పివో శ్రీనివాస రావు,డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన రెడ్డి,మెప్మా, డిఆర్డీఏ పీడిలు కిరణ్ కుమార్,నాగరాజ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు.పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీ-ఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా నాణ్యతతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి మానవతాదృక్పథంతో పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ను అన్ని ప్రభుత్వ కార్యాలయాలు,ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు,పౌర సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.ఫిర్యాదు దారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ సమస్యల పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ అందించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# డోన్ డి యస్ పి శ్రీనివాసులు కు డోన్ అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ నాయకుల శుభాకాంక్షలు





**డోన్ టౌన్, ఆగస్టు 17,(సీమ కిరణం న్యూస్):** 80వ స్వాతంత్ర దినోత్సవ ఆగస్టు 15 తేదీన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చేత బెస్ట్ ఇండియన్ పోలీస్ మెడల్ ను అందుకున్న సందర్భంగా డోన్ డి యస్ పి శ్రీనివాసులు కు డోన్ అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు, స్థానిక డోన్ డి యస్ పి కార్యాలయం లో సోమవారం ఉదయం డోన్ పట్టణ, రూరల్ సి ఐ ఇంతియాజ్ బాషా, రాకేష్ లు బొకే తో పాటు శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం డోన్ అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ నాయకులు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో అక్రెడిటేషన్ జర్నలిస్టు యూనియన్ నాయకులు , సభ్యులు శేఖర్, యన్ రాజు, అంజి ,కల్యాణ్, ఖాదర్ భాష, మల్లికర్జున్, మురళీ, వలిభాష ప్రవీణ్, ఇసాక్, భారత్, రాజేశ్, నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒకరికి జరిమానా



**డోన్ టౌన్, ఆగస్టు 17,(సీమ కిరణం న్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కోర్టు కఠిన చర్యలు తీసు కుంది. డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన డోన్ మండలం దొరపల్లి గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు అనే యువకుడికి డోన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. నురుల్లా సోమవారం పది వేల జరిమానా వెయ్యడం జరిగింది. డోన్ రూరల్ సీఐ సీ.ఎం రాకేష్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, ఇది డ్రైవర్ల ప్రాణాలతో పాటు అమాయక ప్రజల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతుందని హెచ్చరించారు. మద్యం తాగి దొరికితే భారీ జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ చట్టాన్ని గౌరవించి, మద్యం సేవించి వాహనాలు నడపరాదని పోలీసులు కోరారు.

# పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన జిల్లా కలెక్టర్

## -ఒక చిన్న ఆలోచనకు ప్రోత్సాహం..

## కుటుంబానికి ఆర్థిక భరోసా



**నెల్లూరు,ఆగస్టు 17,(సిమ కిరణం న్యూస్):** ఒక చిన్న ఆలోచనకు ప్రభుత్వ ప్రోత్సాహం తోడైతే.. అది ఒక కుటుంబానికి ఆర్థిక భరోసాగా మారుతుంది. ప్రజల సమస్యలను తెలుసుకోవడమే కాకుండా, వారి ఆశయాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" కార్యక్రమం ఇందుకు మరోసారి నిదర్శనంగా నిలిచింది.నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల,ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ గ్రామానికి చెందిన ఎద్దుల కళ్యాణికి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జిల్లా కలెక్టర్ ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. జిల్లా కలెక్టర్ గారి మానసపుత్రికగా నిర్వహిస్తున్న "పల్లె వీక్షణ" కార్యక్రమంలో భాగంగా 2026 జూన్ 19న ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భ్రమరాంబిక సంఘ సభ్యురాలు ఎద్దుల కళ్యాణి ఏర్పాటు చేసిన కంపోస్ట్ ఎరువు తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ యూనిట్‌లో రైతుల వద్ద నుంచి పశువుల పేడను కొనుగోలు చేసి,దానిని కంపోస్ట్‌గా మార్చి, అందులో వేపపిండిని కలిపి నాణ్యమైన కంపోస్ట్ ఎరువును రైతులకు అందిస్తున్నారు.అదే విధంగా అరటి,మామిడి పండ్ల వ్యాపారం కూడా నిర్వహిస్తున్నారు.కళ్యాణి చేస్తున్న కృషిని,రైతులకు అందిస్తున్న నాణ్యమైన ఎరువును,ఆమె నిర్వహిస్తున్న వ్యాపార కార్యకలాపాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంతోషం వ్యక్తం చేసి అభినందించారు.ఈ సందర్భంగా కళ్యాణి,ఆమె భర్త తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు వేపకాయల పొడి తయారు చేసే యంత్రాన్ని కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఎంత మొత్తం అవసరమని కలెక్టర్ అడగగా రూ.80 వేల వరకు అవసరమని వారు తెలిపారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, తన సొంత నిధుల నుంచి రూ.80 వేల ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఇచ్చిన మాటకు కట్టుబడి,పల్లె వీక్షణ కార్యక్రమంలో ఇచ్చిన హామీని నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కార్యరూపంలోకి తీసుకువచ్చారు. రూ.80 వేల చెక్కును స్వయంగా కళ్యాణికి అందజేసి, మాట ఇచ్చి నిలబెట్టుకునే నాయకత్వానికి, ప్రజల ఆశయాలకు అండగా నిలిచే పరిపాలనకు కలెక్టర్ హిమాన్షు శుక్ల నిదర్శనంగా నిలిచారు.ప్రజా సమస్యలను కేవలం వినడంతోనే పరిమితం కాకుండా,వాటికి పరిష్కారం చూపడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ఉన్న ప్రతిభను, ఆలోచనలను,చిన్నతరహా వ్యాపారాలను గుర్తించి ప్రోత్సహించడం "పల్లె వీక్షణ" కార్యక్రమం ప్రత్యేకత. ఒక మహిళ తనకు తానుగా ఉపాధి కల్పించుకోవడమే కాకుండా, రైతులకు ఉపయోగపడే కంపోస్ట్ ఎరువును తయారు చేస్తూ, తన వ్యాపారాన్ని విస్తరించాలనే ఆలోచనతో ముందుకు రావడాన్ని జిల్లా కలెక్టర్ ప్రోత్సహించడం మహిళా సాధికారతకు మరింత ఊతమిచ్చింది.ఈ ఆర్థిక సహాయం అందుకోవడం పట్ల కళ్యాణి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.పల్లె వీక్షణలో తన సమస్యను విని, తాను కోరిన సహాయానికి సానుకూలంగా స్పందించడమే కాకుండా, ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకుని రూ.80 వేల ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ రాజకుమారి పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి జైలు శిక్ష



**డోన్ టౌన్, ఆగస్టు 17,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలో ముగ్గురు కి మద్యం సేవించి వాహనం నడిపిన వారికి జైలు శిక్ష విధించడం జరిగింది. పట్టణంలో సీ.ఐ ఇంతియాజ్ భాష ప్రకటనలో తెలియజేశారు. డోన్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎస్. నూరుల్లా విచారణకు వచ్చిన డోన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన ముగ్గురికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో రెస్పాండెన్స్ అయిన బోయ సునీల్, కొండపేట ,డోన్ టౌన్,(20), అనునతనికి ఎనిమిది రోజులు జైలు శిక్ష . వి . విజయ్ కుమార్, (21) కొండపేట డోన్ టౌన్ అనునతనికి ఎనిమిది రోజులు జైలు శిక్ష. చాకలి గోపాల్(29) కొండపేట డోన్ టౌన్, అనునతనికి ఐదు రోజులు జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపటం ఒక తీవ్రమైన నేరం. ఇలాంటి చర్యలకు డ్రైవరు ప్రాణాలతో పాటు అమాయక ప్రజలు ప్రాణాలను కూడా ప్రమాదంలోనికి నేడతాయి. ఎవరు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించిన వారిపై తక్షణ మే కేసులు నమోదు చేసి, కోర్టు ముందు హాజరపరుస్తారు. మద్యం తాగి వాహనం నడపడం వలన భారీ జరిమానాలు, జైలు శిక్ష తప్పవు. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా ఉండాలంటే ప్రజలందరూ చట్టాన్ని కచ్చితంగా పాటించాలి. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపితే వారి పై డోన్ టౌన్ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం ఎలాంటి వెనుకడుగు వేయరు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం ఇతరుల ప్రాణాల రక్షణ కోసం మద్యం సేవించి వాహనాలు నడపరాదని గట్టిగా హెచ్చరిస్తున్నాము.

# భక్తిశ్రద్ధలతో నాగలకట్టకు ప్రత్యేక పూజలు





**వెల్దుర్తి ఆగస్టు 17 (సీమ కిరణం న్యూస్ )** కర్నూలు జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో వెలసిన నాగలకట్ట వద్ద నాగల చవితి సందర్భంగా వెల్దుర్తి ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించారు. నాగల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగదేవతకు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నాగలకట్ట సమీపంలోని సుంకులమ్మ ఆలయంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

## పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఎంపీడీవో ప్రసన్నకుమారి...



**నెల్లూరు, ఆత్మకూరు,ఏఎస్ పేట ఆగస్టు 17 (సీమ కిరణం న్యూస్);** ఏఎస్ పేట మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో పి.ప్రసన్నకుమారి, డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం లు సోమవారం పరిశీలించారు. ఏఎస్ పేటలో ని పంచాయతీ ఎన్నికలు జరిగే హిందూ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ మేరకు హిందూ ప్రాథమిక పాఠశాలలో 10 వార్డులకు సంబంధించి పోలింగ్ బూతులు, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో 4 వార్డులకుపోలింగ్ బూతులు ఉన్నట్లు తెలిపారు. అయితే ఈ మేరకు హిందూ ప్రాథమిక పాఠశాలలోని 10 వార్డులకు సంబంధించి బూతులు ఉండడంతో ఓటర్లు ఇబ్బందులు గురి అయ్యే అవకాశం ఉందని మరో పోలింగ్ కేంద్రానికి కొన్ని వార్డులను మార్చాలని గ్రామస్తులు విన్నవించారు. ఒకే పాఠశాలలో 10 బూతులు ఉండడంతో ఓటర్లు అవస్థలు గురవుతారని తొక్కిసలాటలు జరిగే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పందించి కొన్ని వార్డులను మరొక కేంద్రానికి బదిలీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షరీఫ్ సిబ్బంది పాల్గొన్నారు...

## ఆగిన బైపాస్ రోడ్డు పనులపై ఆర్డీవో కు సిపిఎం ఫిర్యాదు..



**నెల్లూరు ఆత్మకూరు ఆగస్టు 17 రహమదాబాద్ టైమ్స్ ప్రతినిధి;** ఆత్మకూరు పట్టణంలోకి వచ్చే ప్రధాన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు గత తొమ్మిది నెలలుగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆర్డీవో బి.పావని కు సోమవారం వినతిపత్రం అందించారు. దుమ్ము, ధూళి, గుంతలతో విద్యార్థులు, వృద్ధులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారని ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు రోడ్డుపై ఉన్న రాళ్ల కారణంగా తీవ్ర ఇబ్బంది నెలకొందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పని త్వరితగతిన పూర్తి చేసి సమస్యను సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సందాని భాష ఇతర సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సందల్ మాలి మహిళలకు ప్రత్యేక అవకాశం...



**నెల్లూరు, ఆత్మకూరు,ఏఎస్ పేట ఆగస్టు 17 (సీమ కిరణం న్యూస్);** ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ అమ్మజాన్ వస్తానమ్మ దర్గాలో 253వ గంధ మహోత్సవం సందర్భంగా మహిళల కొరకు ప్రత్యేకంగా నిర్వహించే (సందల్‌మాలి) కార్యక్రమం ఆదివారం రాత్రికి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దర్గా ఈవో మహమ్మద్ హుస్సేన్ పర్యవేక్షణలో ఈ ప్రత్యేక కార్యక్రమం సాంప్రదాయంగా జరిగింది. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ ఈ కార్యక్రమనికి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గా లోపలికి వెళ్లి దొరసానమ్మ సమాధులను దర్శించుకుని గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఈ అరుదైన సంప్రదాయ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఏఎస్‌పేట దర్గాకు తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ సూచనలతో, సీఐ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ జిలానితో పాటు దుత్తలూరు ఎస్ఐ సుభాషిని, కండలేరు ఎస్ఐ భవాని, సంగం ఎస్ఐ భోజ్య నాయక్ 60 మంది పోలీసు సిబ్బంది తో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

# విద్యార్థులకు కంటి పరీక్షలు



**నెల్లూరు, ఆత్మకూరు, ఏఎస్ పేట, ఆగస్ట్ 17(సీమ కిరణం న్యూస్):** ఏఎస్ పేట మండల కేంద్రం లోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలను సోమవారం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ (డిబిసిఎస్) ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అసిస్టెంట్ సుబ్రమణ్యం తెలిపారు. పాఠశాలలోని 6వ తరగతి నుండి 10వ తరగతి చదివే విద్యార్థులు అందరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ప్రభుత్వం నుండి ఉచితంగా కంటి అద్దాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కే దొరసామిరెడ్డి పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ కృషి చేస్తుంది

## -నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత అశోక్



**నెల్లూరు,ఆగస్టు 17,(సీమ కిరణం న్యూస్)::** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా రెండవ దశలో ఓటరు జాబితా రూపకల్పనలో అర్హులైన వారి నుంచి ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను స్వీకరిస్తున్నారు.నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ దంపతులు స్థానిక 53 వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీ ప్రాంతంలోని అర్హులైన ఓటర్ల ధృవీకరణ పత్రాలను సేకరించి స్థానిక సచివాలయం పరిధిలోని ఎన్నికల బూత్ లెవెల్ అధికారికి సోమవారం అందజేశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ కృషి చేస్తోందని, మొదటి దశ జాబితాలో ఓటరు నమోదు కాని వారు తమకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను సంబంధిత బి.ఎల్.ఓ లకు అందజేయాలని వారు సూచించారు.

# వాహన నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం : ఎంవిఐ రాములు



**నెల్లూరు, ఆత్మకూరు, ఆగస్టు 17, (సీమకిరణం న్యూస్):** ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం.వి.ఐ ఎం.రాములు సంగం వద్ద నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు ఉన్నాయా వాహన ఇన్సూరెన్సులు, డ్రైవర్ల లైసెన్స్ లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం చేయరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ట్రాక్టర్లపై ప్రమాదకరంగా ప్రయాణించవద్దని సూచించారు. నిబంధనలు పాటించకుంటే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# గ్రామపంచాయతీకి 2లక్షలు ఆదాయం



**నెల్లూరు, ఆత్మకూరు,ఏఎస్ పేట ఆగస్టు 17 (సీమ కిరణం న్యూస్);** ఏఎస్ పేట మండల కేంద్రం లోని శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఏఎస్ పేట దర్గాకు వచ్చే వాహనాలకు సంబంధించి వేలంపాటను సోమవారం నిర్వహించారు ఏఎస్ పేట పంచాయతీ ప్రత్యేక అధికారి యాసిన్, డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం, పంచాయతీ కార్యదర్శి షరీఫ్ ల ఆధ్వర్యంలో వేలంపాటను నిర్వహించారు. ఈ నెల 18వ తేదీ నుండి సెప్టెంబరు 17వ తేదీ వరకు నెల రోజులపాటు వాహనాల నుంచి రుసుము వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు ఈ మేరకు ఈ వేలం పాటలో ముగ్గురు దరఖాస్తు రుసుము చెల్లించి పాటలో పాల్గొన్నారు నెల రోజులకు సంబంధించి వాహనాల వేలంపాటను 2లక్షల రూపాయలకు మొగల్ గౌస్ బాషా అనే వ్యక్తి కైవసం చేసుకున్నారు. వాహనాల వద్ద నుంచి పాటలో నిర్ణయించిన రుసుము మాత్రమే వసూలు చేయాలని యాత్రికులను ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు. ఈ వేలంపాట ద్వారా గ్రామ పంచాయతీకి 2లక్షలు రూపాయలు ఆదాయం వచ్చినట్లు ప్రత్యేక అధికారి యాసీన్ తెలిపారు.

## చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం

-నెల్లూరు జిల్లా ఎస్‌పి డా.అజిత వెజెండ్ల



**నెల్లూరు,ఆగస్టు 17, (సీమకిరణం న్యూస్)::** ప్రజా సమస్యలను సత్వరంగా పరిష్కరించడంతో పాటు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయం చేయాలని ప్రజా వినతులు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్‌పి డా.అజిత వెజెండ్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల,ఇతర అధికారుల సమక్షంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి 162 ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజా ఫిర్యాదుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదు. ప్రజలతో మర్యాదపూర్వకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి,ప్రతి పిటిషన్‌ను సమగ్రంగా విచారించి త్వరితగతిన పరిష్కరించాలి,బాధితులకు చట్టపరమైన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలి అని ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు.పిజిఆర్ఎస్ లో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని,సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్. పి అడ్మిన్ సిహెచ్ సౌజన్య,డబ్ల్యూ పిఎస్ డి.ఎస్.పి వేమారెడ్డి, డబ్ల్యూ పిఎస్ సీఐ సుబ్బారావు,పిసిఆర్ సీఐ భక్త వత్సల రెడ్డి,ఎస్బిఐ సీఐ దశరథ రామారావు, పీజీఆర్ఏస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

-పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా



**నెల్లూరు,ఆగస్టు 17, (సీమ కిరణం న్యూస్):** ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించడంతో పాటు, సమస్యలు తిరిగి తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హిమన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి ప్రజలు సమర్పించిన అర్జీలను, అర్జీదారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఒక్కో అర్జీని పరిశీలిస్తూ,సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.అర్జీలు రీ-ఓపెన్ కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం సంబంధిత అధికారులు అర్జీదారులతో నేరుగా మాట్లాడి,సమస్యకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి,వాస్తవ పరిస్థితులను తెలుసుకుని పరిష్కారం చూపాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను కేవలం అర్జీ పరిష్కారంగా భావించకుండా,సమస్యకు మూలకారణాన్ని గుర్తించి, అర్జీదారుడికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కావలి, నెల్లూరు ఆర్డీవోలు ఎలీషా, అనూష,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగశేఖర్,సుమారు 30 మంది అర్జీదారులు, అధికారులు,వివిధ మండలాల సర్వేయర్లు, పోలీస్ శాఖకు చెందిన సిఐలు,ఎస్ హెచ్ వోలు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్





**నెల్లూరు,ఆగస్టు 17, (సీమకిరణం న్యూస్)::** నెల్లూరు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత ముమ్మరం చేశారు. ప్రజల భద్రత,శాంతి భద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ప్రధాన కూడళ్లు,రహదారులు,కీలక ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్,ఓపెన్ డ్రింకింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. రాత్రి వేళల్లో నగర,శివారు ప్రాంతాలు,ప్రధాన రహదారులపై విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తున్నారు.అక్రమ రవాణా, నేర కార్యకలాపాలు,ఇతర చట్టవ్యతిరేక చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు,నిఘా చర్యలు కొనసాగుతున్నాయి.చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా కార్యకలాపాలను గమనించిన వెంటనే డయల్-112,పోలీస్ కంట్రోల్ రూమ్ o91 93929 03413, ఈగల్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందించి పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కలబందను అసలు ఎలా తీసుకోవాలి



ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కలబందలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కలబంద గుజ్జును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. చాలా మంది ప్రస్తుతం కలబందను ఇండ్లలోనే పెంచుతున్నారు. దీంతో మనకు కలబంద ఎప్పుడు కావాలంటే అప్పుడు లభిస్తుంది. ఇక మార్కెట్‌లోనూ కలబంద జ్యూస్‌ను విక్రయిస్తున్నారు. దీన్ని కూడా మనం ఉపయోగించవచ్చు. అయితే కలబంద నిజంగా మనకు ఆరోగ్య ప్రదాయిని అనే చెప్పవచ్చు. కలబంద జ్యూస్‌ను తాగడం లేదా కలబంద గుజ్జును ఉపయోగించడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా కలబంద ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎలా తీసుకోవాలి అనే విషయం చాలా మందికి తెలియదు.

### ఇలా తీసుకోవాలి..

కలబంద గుజ్జు లేదా జ్యూస్‌ను నేరుగా అలాగే తీసుకోవచ్చు. అయితే కలబంద రుచి కొందరికి నచ్చకపోవచ్చు. ఇది కొందరికి చేదుగా, వగరుగా అనిపిస్తుంది. కనుక అలాంటి వారు తేనెను చేర్చి తీసుకోవచ్చు. అయితే కలబందను అలర్జీలు ఉన్నవారు తీసుకోకూడదు. కలబందను తింటే కొందరికి పడదు. దీంతో వారికి చర్మంపై దురదలు వస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక ఈ సమస్యలు ఎదుర్కొనే వారు కలబందను తినకూడదు. కలబందలో మన శరీరానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలతోపాటు విటమిన్లు, మినరల్స్ కూడా ఉంటాయి. అందువల్ల కలబందను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

### రోగ నిరోధక శక్తికి..

కలబందను రోజూ ఒక టీస్పూన్ మోతాదులో జెల్ తినవచ్చు. అదే జ్యూస్ అయితే రోజూ 30 ఎంఎల్ మోతాదులో తాగవచ్చు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఇ, పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. కలబందలో ఉండే విటమిన్ ఎ మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తుంది. కలబందను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరిగి కళ్లద్దాలను తీసి పడేస్తారు. ఇక కలబందలో ఉండే విటమిన్ సి మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

### శిరోజాలు, ముఖానికి..

కలబంద మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కలబందను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం తగ్గుతాయి. జీర్ణవ్యవస్థలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కలబంద శిరోజాలు, ముఖానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. దీంతో తయారు చేసే ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లను ఉపయోగించడం వల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాదు, శిరోజాలు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఇలా కలబంద వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్

**నెల్లూరు,ఆగస్టు 17 (సీమకిరణం న్యూస్)::** నెల్లూరు జిల్లాలో నేరాల నియంత్రణ,అసాంఘిక కార్యకలాపాల కట్టడి,ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ డా అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్,ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డేపాలెం గ్రామంలోని జగనన్న కాలనీలో నెల్లూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణు ఆధ్వర్యంలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు,18 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొని.. జగనన్న కాలనీ పరిసరాల్లో సుమారు 100 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో సరైన ఆధారపత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని తదుపరి పరిశీలన నిమిత్తం ఉంచారు.వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించిన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలపై చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు.స్థానిక ప్రజలకు సైబర్ మోసాలు, ఆస్తి సంబంధిత నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు,రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ ధరించడం,ట్రాఫిక్ నిబంధనలు,డయల్ 112 అత్యవసర సేవలు, సామాజిక రుగ్మతల నివారణ తదితర అంశాలపై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు,బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని సూచించారు.పిల్లల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు కోరారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో భాగంగా నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని,ప్రజలు పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు తెలిపారు.





## తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక




వాన వెలిశాక మట్టి వాసన, ఆరుద్ర పురుగుల సర్కస్ ఫీట్లు, పిచ్చుకల మట్టి స్నానాలు, వెన్నెల్లో ఆడిన ఆటలు, ఎండకాలం బావుల్లో ఈతలు ఈనాడేవి? మన చిన్నతనం మనకు చిన్నతనం కాదు. బాల్యం మళ్లీ రమ్మంటే వస్తుందా? 'అనుభూతులను పోగొట్టుకున్న గుండె ఎడారి. అనుభూతులను పదిలపరచుకున్న గుండె సతత హరితారణ్యం'. ఇటువంటి మధురమైన భావాల సుమమాల డాక్టర్ నలిమెల భాస్కర్ 'సుద్దముక్క'. ఈ పుస్తకంలో శ్రామిక జనజీవన చిత్రణం ఆర్ద్రంగా ఉంటుంది. శ్రామికుల రుణం తీర్చుకోవాలనిపించేలా చేస్తుంది. తమ బతుకులను బండలకేసి బాదుకుంటూ మన బట్టలను గట్టున ఆరేస్తారు రజకులు. మన బట్టలను పిండి వాళ్ల తోలు బొమ్మలవుతారు. వాళ్లుతికిన దుస్తులతో మనం మన లోపలి ముఖాన్నీ, మురికినీ చాటు చేసుకొని రోజూ నాగరికులమవుతాం. ఎవరి బట్టలను వారికి, తప్పిపోకుండా అందించే అమోఘమైన జ్ఞాపకశక్తి వారిది. 'సమాజ కల్మషాన్ని కడిగివేయడానికి/ కంకణధారులైన వ్యక్తులు సంస్కర్తలైనప్పుడు/ తరతరాలుగా మైలబట్టల్ని/ మల్లెపూలు ఉల్లిపొరలూ చేసేందుకు/ కటి బద్ధులైన వీళ్ళూ సంస్కర్తలే'. ఇలాంటివన్నీ ఒక ఎత్తు అయితే.. ఉపాధ్యాయుని గురించి, సుద్దముక్క గురించి రాసిన ఆరు కవితలు మరొకెత్తు. ఆ ఆరు కవితలలో ఉపాధ్యాయున్ని ప్రపంచాన అగ్రభాగాన నిలిపారు నలిమెల. అధ్యాపకునికి అక్షరాభిషేకం చేశారు. 'అతడు కాలుమోపడం తోటే అణువణువూ అక్షరమవుతుంది/ అతని మాటల రెక్కల మీద/ పిల్లలు అత్యంత సురక్షితంగా/ జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు' అని ఉపాధ్యాయుడి ఔన్నత్యాన్నీ, 'క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారీ/ అతని కుడిచేతికి ఆరో వేలు/ అదనంగా మొలుస్తుంది/ అది కచ్చితంగా జ్ఞానం ఘనీభవించిన తెల్లని సుద్దముక్కే' అని చాక్‌పీస్ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తారు. సుద్దముక్క సూర్యగోళం నుంచి కోసుకొచ్చిన రశ్మి శకలం. చందమామ నుంచి తీసుకొచ్చిన వెన్నెలగడ్డ అన్నప్పుడు భాస్కర్ కవిత్వం తారస్థాయికి చేరుతుంది. సౌందర్యోపేతం అవుతుంది. చాక్‌పీస్ విద్యార్థులకు 'సమస్తమైన దిక్కులను నిర్దేశించగల చుక్కాని/ తరగతికి వెళ్లే ఉపాధ్యాయునికి ఊపిరి గుళిక/ ఉపన్యాసకులకు ఊతకర్ర'. భాస్కర్ దృష్టిలో ఈ భూమండలం మీద ఏకైక లోకైక దర్శనీయ స్థలం 'బడి'. 'సుద్దముక్క' తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక. ఇందులో అడుగడుగునా కవిత్వం, అణువణువునా నవత్వం, ప్రతివాక్యం ఆస్వాదయోగ్యం, అనుభవైకవేద్యం.

## ఏది తల్లీ గట్లుంటది నాటి సాహిత్యం

### ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు

పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్ట్‌లు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన



మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్లు పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు. ఆ కేంద్ర స్థానాన్ని, ఆ ఉద్యమాన్ని ఇక్కడివారు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరుగుతోందా? రాష్ట్రం విడిపోవడానికి ముందు తెలంగాణ సాధన కోసం అనేక మంది కవయిత్రులు ఉద్యమ కవిత్వాన్ని అద్భుతంగా రాశారు. దాని ప్రభావం కచ్చితంగా ఉద్యమంపై పడి అది మరింత బలపడింది. కవిత్వమో, పాటో, కథో, నవలో మొత్తానికి తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా, ప్రత్యేక రాష్ట్రం రావాల్సిన ఆవశ్యకతపై సాహిత్య సృజన జరిగింది. రాష్ట్రం సిద్ధించింది. చిరకాల కోరిక ఈడేరింది. ప్రాంతీయ ఉద్యమాలే ఆలంబనగా ఆ సాహిత్యం వచ్చింది. అయితే, ఆ తర్వాత అంతే ఉద్యమ, సామాజిక స్ఫూర్తిని ఇవ్వాల్సిన సాహిత్యం కూడా నిలిచిపోయిందా. ఇప్పుడూ కవయిత్రులు రాస్తున్నారు కదా అనే ప్రశ్న రావచ్చు. వస్తోంది. ఆ కాలంతో పోల్చుకుంటే చాలా తక్కువగానే రాస్తున్నారు. తాము స్పందించకపోతే ఎలా అనే కారణంగానే ఒకటి, రెండు రాస్తున్నారు. ఎక్కువగా మాత్రం కవయిత్రులు తమ వ్యక్తిగతానికే పరిమితం అవుతున్నారని అనిపిస్తున్నది. అంతకుముందు ఉమ్మడి ఏపీలో వచ్చిన అనేకానేక ఉద్యమాలకు స్ఫూర్తి ఆ నాటి సాహిత్యమే. ఆ తర్వాత వచ్చిన పరిణామాల ప్రభావం సాహిత్యంపై పడటమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇప్పుడు రాస్తున్న కవయిత్రుల్లో చాలామంది అద్భుత కవిత్వాన్నే రాస్తున్నారు. కానీ, ఎక్కడో ఓ వెలితి వెంటాడుతోంది.